క్లుప్తంగా

నేడు జేఎన్‌టీయూహెచ్ గోల్డెన్‌జూబ్లీ బిల్డింగ్ ప్రారంభం

కేపీహెచ్‌బీకాలనీ: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం, హైదరాబాద్‌లో నూతనంగా నిర్మించిన గోల్డెన్‌జూబ్లీ బిల్డింగ్‌ను వీసీ ప్రొఫెసర్ టి. కిషన్‌కుమార్ రెడ్డి గురువారం ఉదయం ప్రారంభించనున్నారు. ఈ మేరకు రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

సాయిబాబా ఆలయంలో 6న శ్రీరామ నవమి వేడుకలు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ, ఈస్ట్ సాయినగర్‌లోని షిర్డీ సాయిబాబా మందిరంలో 6న శ్రీరామ నవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షులు ఎస్. కపిల్ రాజు, సురభి రమేష్‌రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం సీతారాముల కల్యాణం, అనంతరం సుమారు 4 వేల మంది భక్తులకు అన్నదానం కార్యక్రమం, సాయంత్రం 7 గంటలకు లవకుశ నాటకం ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయమని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. బుధవారం స్కిన్ హెయిర్ లెస్ క్లినిక్ ఎండీ మాధవి ఆధ్వర్యంలో కళింగ ఎన్‌క్లేవ్ హైటెన్షన్ రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాహంతో ఇబ్బంది పడుతున్న పాదచారులకు చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో టింక్‌గౌడ్, మనీష్‌చారి, కృష్ణచారి, వేణుగోపాల్, రాజు, లక్ష్మి, శ్రావణి, బుర్రి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మురుగునీరు రాకుండా సరఫరా చేయాలి



డ్రైనేజీలో పూడికతీతను పరిశీలిస్తున్న కార్పొరేటర్

ఓల్డ్ బోయిన్‌పల్లి: మంచినీటి సరఫరాలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మురుగు నీరు సరఫరా కాకుండా అధికారులు చొరవ చూపాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. బుధవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ శ్రీ సాయి ఎన్‌క్లేవ్‌లో పర్యటించారు. డ్రైనేజీలు నిండి దుర్గంధం వస్తుందని, అధికారులు పట్టించుకోవడం లేదని, మంచినీటి సరఫరాలో మురుగునీరు సరఫరా అవుతుందని కాలనీ వాసులు ఆయనకు వివరించారు. వెంటనే కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ ఏఈ, వాటర్ వర్క్స్ మేనేజర్‌తో మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. డ్రైనేజీలను పూడిక తీయించారు. కార్యక్రమంలో శ్రీ సాయి ఎన్‌క్లేవ్ కమిటీ అధ్యక్షుడు సిద్దిరాంరెడ్డి, మధుకర్ రెడ్డి, విశ్వనాథం, లింగం, దేవేందర్‌రెడ్డి, రిటైర్డ్ డీఎస్పీ లింగన్న తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సీనియర్ నాయకుడు విశ్వేశ్వర్‌రావు మృతి



నివాళులర్పిస్తున్న రామచంద్రరావు, మాధవరం కాంతారావు

కూకట్‌పల్లి: బీజేపీ సీనియర్ నాయకుడు బందా విశ్వేశ్వర్‌రావు గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మరణం పట్ల కూకట్‌పల్లి బీజేపీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన పార్థివ దేహానికి మాజీ ఎంపీ ఎన్. రామచంద్రరావు, కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం పెద్ద ఎత్తున కార్యకర్తలతో కలిసి అంతిమ యాత్రలో పాల్గొని కడసారి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో మూసాపేట డివిజన్ కార్పొరేటర్ మహేందర్, నాయకులు పద్మయ్య, మనోహర్, హరిబాబు పాల్గొన్నారు.

అర్హత లేని డాక్టర్లతో వైద్యం..

- భవిష్య వెల్ విషర్ ఆసుపత్రికి రూ.5 లక్షల జరిమానా
- డీఎంహెచ్ఓ డాక్టర్ ఉమాగౌరీ వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని చెంగిచర్ల భవిష్య వెల్ విషర్ ప్రైవేట్ ఆసుపత్రిలో అర్హత లేని డాక్టర్లు రోగులకు వైద్య సేవలు అందించటాన్ని తీవ్రంగా పరిగణిస్తూ ఈమేరకు చర్యలు తీసుకున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఉమాగౌరీ తెలిపారు. ఆసుపత్రిలో అర్హత కలిగిన మెడికల్ డైరెక్టర్ లేకపోవడంతోపాటు అర్హత లేని సిబ్బందిని నియమించారన్నారు. అధిక శక్తి కలిగిన మాత్రలను రోగులకు వినియోగించటంతోపాటు అనధికార వైద్య చికిత్సలను చేయటాన్ని ఆసుపత్రిలో గుర్తించినట్లు ఆమె పేర్కొన్నారు. లైసెన్స్ పొందిన పారా మెడికల్ సిబ్బంది కూడా ఆసుపత్రిలో లేరన్నారు. బుధవారం ఆకస్మికంగా చెంగిచర్ల భవిష్య వెల్ విస్సర్ ప్రైవేట్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనఖీ చేయగా.. విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చినట్లు డీఎంహెచ్ఓ తెలిపారు. ప్రభుత్వ నిబంధలు ఉల్లఘించిన భవిష్య వెల్ విస్సర్ ఆసుపత్రి యాజమాన్యానికి రూ. 5 లక్షల జరిమానా విధించటంతోపాటు ఆసుపత్రి రిజిస్ట్రేషన్‌ను 60 రోజులు తాత్కాలికంగా సస్పెండ్ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. యాజమాన్యంపై ఈ మేరకు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేసేందుకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఆసుపత్రిలో వైద్య పరికరాలు జప్తు చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు ఈ తక్షణ చర్యలు తీసుకున్నామన్నారు. డీఎంహెచ్ఓ డాక్టరు సి. ఉమాగౌరీతో సహా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ గీతా, అసిస్టెంట్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టరు వినోద్, రెవిన్యూశాఖ , పోలీసు అధికారులు పాల్గొన్నారు.



జరిమానా వేస్తున్న అధికారులు

భవిష్యత్ తరాల కోసం హెచ్‌సీయూ భూములను కాపాడుకోవాలి

- విద్యార్థుల పోరాటానికి సంపూర్ణ మద్దతు
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: హెచ్‌సీయూ భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, భవిష్యత్ తరాల కోసం అడవులను కాపాడాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం శేషాద్రి నగర్‌క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ నగరంలో గాలి కాలుష్యం అవుతున్నదని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం హెచ్చరించిందన్నారు. ఇందిరాగాంధీ హయాంలో యూనివర్సిటీకి ఈ భూములు కేటాయించారని, ఆ భూమిని ఈ రోజు విక్రయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హరిత హారం చేపట్టి అనేక మొక్కలను నాటితే నేడు చెట్లుగా మారి నీడ, గాలిని ఇస్తున్నాయని గుర్తు చేశారు. నగరానికి ఆక్సిజన్ అందించే హెచ్‌సీయూ భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుడిపై ఉందని ఉద్ఘాటించారు. విద్యార్థుల పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. కూకట్‌పల్లిలోని 517 ఎకరాల ఉదాసీ మఠం వారి భూమిని పర్యావరణానికి ఉపయోగపడేలా ఆ భూమిని పక్షులకు, జంతువులకు కొంత మేర వదిలేసి మిగతా భూమిని కూడా ప్రకృతి సోయగాలతో అందంగా తీర్చిదిద్దేటట్లు ఏర్పాటు చేస్తున్నామని గుర్తు చేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

నివాళులర్పించిన ఎమ్మెల్యే

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీ బీజేపీ సీనియర్ నాయకులు బందా విశ్వేశ్వరరావు మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కృష్ణారావు, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సతీష్ అరోరాతో కలిసి బుధవారం ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో నాయకులు గోపి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి పాపన్నగౌడ్



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మోతీనగర్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్వాయి పాపన్నగౌడ్ అని నాయకులు అన్నారు. మూసాపేట డివిజన్ మోతీనగర్ ప్రధాన రోడ్డులో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దూడల రవిగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన పోరాట స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో నర్సింగరావు, గంట మల్లేష్, దూడల సురేష్ గౌడ్, దూడల మధుగౌడ్, యాదగిరి యాదవ్, వెంకటస్వామి, హనుమంతరావు, శశికుమార్, యాకమ్మ, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీ: మొఘలులపై మూడు వందల యాభై ఏళ్ల క్రితమే పోరాడి, బడుగు బలహీన వర్గాల అణిచివేతను, మొఘలుల నిరంకుశ పాలనను వ్యతిరేకించిన ధీరుడు సర్వాయి పాపన్న గౌడ్ అని వక్తలు అన్నారు. వర్ధంతి సందర్భంగా బుధవారం శేరిలింగంపల్లి గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు దొంతి లక్ష్మీనారాయణ గౌడ్ అధ్యక్షతన జరిగింది. మియాపూర్ ఆల్విన్ చౌరస్తాలోని పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఏకాంత్ గౌడ్, గౌడ సంఘం పెద్దలు పాల్గొన్నారు.



పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నేతలు

నేడు దొడ్డి కొమురయ్య జయంతి

సాక్షి, సిటీబ్యూరో: జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయంలో గురువారం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆశాఖ జిల్లా అధికారి ఝాన్సీరాణి తెలిపారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, కురుమ సామాజిక సంఘాల నాయకులు, వివిధ కులాల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆమె కోరారు.

కలెక్టరేట్‌లో సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి

సాక్షి, సిటీబ్యూరో: బుధవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటం వద్ద డీఆర్ఓ హరిప్రియ, అధికారులు నివాళులర్పించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి టి.ఝాన్సీరాణి, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి జి.వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు అనుమతివ్వాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీలోని సర్వే నంబర్145, 163లోని సర్దార్‌పటేల్ నగర్, వసంత్‌నగర్, భగత్ సింగ్ నగర్ ఫేజ్ 1, 2, సీబీసీఐడీ, శిల్పా, ఎన్ఆర్ఎస్ఏ కాలనీ, డైమండ్ ఎస్టేట్ పరిధిలోగల ప్రాంతాల్లో భవన నిర్మాణాలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. బుధవారం అన్ని కాలనీ అధ్యక్షులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా నివాసముంటున్న ఈ ప్రాంతాల్లో ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. వారి స్థలాల్లో ఇళ్ల నిర్మాణం చేసుకోవాలన్నా కూడా ప్రభుత్వ అనుమతి నిరాకరించడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే దీనిపై స్పందించి ప్రజలకు మేలు కలిగేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కేపీహెచ్‌బీ డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు నాగేశ్వరరావు, నాగిరెడ్డి, హనుమంతరావు, సాంబశివరావు, ప్రభాకర్, రామారావు, శిల్పా ప్రభాకర్ పాల్గొన్నారు.

సన్న బియ్యం పేదలకు వరం



హస్మత్‌పేట్‌లోని రేషన్ షాపులో సన్న బియ్యం అందజేస్తున్న టీపీసీసీ కార్యదర్శి యాదగిరి



వల్లబ్‌నగర్‌లోని రేషన్ షాపులో సన్న బియ్యం అందిస్తున్న రాజేందర్

ఓల్డ్ బోయిన్‌పల్లి: సన్న బియ్యం పేద ప్రజలకు వరంలాంటిదని, పేద ప్రజలకు పట్టెడన్నం పెట్టాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీని నిజం చేసిందని టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి, బోయిన్‌పల్లి వ్యవసాయ కూరగాయల మార్కెట్ కమిటీ డైరెక్టర్ నల్లోల రాజేందర్ అన్నారు. బుధవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని వల్లబ్‌నగర్, బడేగూడ, భవానీనగర్, మల్లికార్జున కాలనీలలో వివిధ రేషన్ షాపులలో సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రజా పాలన ప్రభుత్వంలో పేద ప్రజల కోసం తీసుకున్న నిర్ణయంతో తెల్లరేషన్ కార్డులు కలిగిన వారికి సన్న బియ్యం అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున యాదవ్, కనకరాజుయాదవ్, దేవరకొండ కుమార్, స్వామి, అదిల్‌ఖాన్, ప్రమోద్, రోహిత్, అస్లాం సోఫీ తదితరులు పాల్గొన్నారు.



వసంత్‌నగర్‌కాలనీ బస్టాప్ దగ్గర ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మజ్జిగ, మంచినీరు పంపిణీ చేస్తున్న క్లాసెస్ ఐఐటీ ఇనిస్టిట్యూట్, సేవ్ ఏ లైఫ్ సంస్థ అధ్యక్షులు రాణా ప్రతాప్ సూరగన తదితరులు

– కేపీహెచ్‌బీకాలనీ

సన్న బియ్యం ఇచ్చేది కేంద్ర ప్రభుత్వమే

కూకట్‌పల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్నబియ్యం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే ఇస్తుందని బీజేపీ కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం ద్వారా బియ్యం ఖర్చంతా కేంద్రమే భరిస్తుందని తెలిపారు. కిలో బియ్యానికి కేంద్రం 40 రూపాయలు చెల్లిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చేది కిలోకు 10 రూపాయలు మాత్రమే అన్నారు. రాష్ట్రంలో బీజేపీ పార్టీకి క్రెడిట్ దక్కుతుందనే రాజకీయ స్వార్థంతో కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ పంపిణీ సమయంలో లబ్ధిదారులకు కనీసం రోదును సైతం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పాఠశాలకు స్థలం మంజూరు

కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు

నిజాంపేట్ : ఎట్టకేలకు బాచుపల్లి ప్రభుత్వ పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి, ప్లే గ్రౌండ్ కోసం జిల్లా కలెక్టర్ గౌతమ్ 20 గుంటలు స్థలాన్ని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదనపు గదుల కోసం స్థలం లేక గదులు నిర్మించలేని పరిస్థితిలో ఉండడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, పలువురు నాయకులు జిల్లా కలెక్టర్‌ను, అడిషనల్ కలెక్టర్‌ను కలిసి పలుమార్లు ఫిర్యాదు చేశారు. సాక్షి సైతం ఈ సమస్యను పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చే ప్రయత్నం చేసింది. దీంతో ఎట్టకేలకు స్పందించిన జిల్లా కలెక్టర్ ఎమ్మార్వో నివేదిక ఆధారంగా 20 గుంటల స్థలాన్ని కేటాయిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల గదులు నిర్మాణానికి సీఎస్ఆర్ నిధులు సైతం సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం స్థలం మంజూరు కావడంతో అదనపు తరగతుల నిర్మాణం వేగవంతంగా పూర్తి అయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కలెక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


సాక్షి
పాఠశాలకు స్థలం ఇప్పించండి!

బీవీఆర్‌ఐటీలో ఘనంగా సినర్జియా 2025 వేడుకలు

నిజాంపేట్ : బాచుపల్లిలోని బీవీఆర్‌ఐటీ కళాశాలలో బుధవారం సినర్జియా 2025 వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సుమారు 500 మంది విద్యార్థులు వివిధ సాంకేతికత, సాంస్కృతిక పోటీలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.వి.ఎస్.సునిత మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని మూడు రోజుల పాటు నిర్వస్తున్నామని తెలిపారు. నూతన సాంకేతికతకు సంబంధించిన అనేక పోటీలు జరుగుతున్నాయని వివరించారు. అనంతరం సినర్జియా కన్వీనర్ డా.మాలతి మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సాంకేతిక పోటీ భావాన్ని పెంపొందించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు.

ఆర్‌ఆర్ నగర్‌లో ఈద్ మిలాద్

ఓల్డ్ బోయిన్‌పల్లి: రంజాన్ సందర్భంగా ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ ఆర్ఆర్‌నగర్‌లో బీఆర్ఎస్ అధ్యక్షుడు ఇర్ఫాన్ ఏర్పాటు చేసిన ఈద్ మీలాద్ కార్యక్రమానికి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముస్లింలు శాలువా కప్పి కార్పొరేటర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మన్నె ఉదయ్‌యాదవ్, మల్లికార్జున యాదవ్, మేకల హరినాథ్, మేరాజ్, ఖాజ కుతుబ్బుద్దీన్, కర్రె జంగయ్య, సయ్యద్ ఏజాజ్, ఖాదీర్, బుర్రి యాదగిరి, మల్లేష్‌యాదవ్, వాజిద్, మజార్, మహేష్ యాదవ్, శ్రీకాంత్‌యాదవ్, వెంకట్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, నాయకులు

విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూల్‌లో బుధవారం 10వ తరగతి విద్యార్థుల గెట్ టు గెదర్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ మాట్లాడుతూ.. 10వ తరగతి పరీక్షలు ముగిసిన తరువాతే అసలైన జీవితం ప్రారంభం అవుతుందని అన్నారు. ఉన్నతమైన లక్ష్యం ఏర్పాటు చేసుకుని, లక్ష్య సాధన దిశగా నడవాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీలకు రాజీవ్ యువ వికాసం పథకం

అర్హులు 14 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా షెడ్యూల్డ్ తెగల ఆర్థిక సహకార సంస్థ (ట్రైకార్)అధ్వర్యంలో ఎస్టీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాల ద్వారా ఆర్థిక పురోగతి పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన 'రాజీవ్ యువ వికాసం పథకం'ప్రకటించిందని జిల్లా కలెక్టర్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. వయస్సు 21–55 సంవత్సరాలు కలిగి ఉన్న అభ్యర్థులు ఉపాధి హామీ పథకాలకు, 21–60 సంవత్సరాలు కలిగి ఉన్న అభ్యర్థులు భూసంబంధ, ఉద్యానవన, వ్యవసాయ పరికరాల పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఏప్రిల్ 14 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.